
# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ

జిల్లా వార్తలు

గురువారం 1 ఆగస్టు 2024 | 5



పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్‌పై దాడికి యత్నం - 7లో

రుణాల పేరుతో సొమ్ములు స్వాహా

» వెలుగులోకి వస్తున్న యానిమేటర్ అక్రమాలు - 7లో


## జగనన్న కాలనీ రోడ్లపై వరినాట్లు

» గొల్లప్రోలులో అధ్వాన రహదారులపై వినూత్న నిరసన



గొల్లప్రోలు జగనన్న కాలనీలో అధ్వానంగా ఉన్న రహదారులపై వరినాట్లు వేస్తున్న ఏఐఎఫ్‌టీయూ నేతలు, కాలనీవాసులు

గొల్లప్రోలు, జూలై 31: గొల్లప్రోలు పట్టణంలోని జగనన్న కాలనీలో అధ్వానంగాఉన్న రహదారులపై అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణ శివారులోని జగనన్నకాలనీలో ఉన్న ప్రధాన, అంతర్గత రహదారులన్నీ బురదమయంగా మారి నడవడానికి సైతం వీలులేని అధ్వానస్థితికి చేరాయి. ఈనేపథ్యంలో ఏఐఎఫ్‌టీయూ నాయకులు, కాలనీవాసులు అధ్వానంగా ఉన్న రహదారులపై వరినాట్లు వేసి తమ నిరసన ప్రకటించారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు మాట్లాడుతూ ఇళ్లస్థలాలు ఇచ్చి గృహాలు నిర్మించుకోమని చెప్పిన వారు ఇక్కడ కనీస సౌకర్యాలు కల్పించడంతో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కోట్లాది రూపాయిలు అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న నాయకులకుగానీ, గతంలో స్థలాలు ఇచ్చిన నేతలకు తమ కష్టాలు పట్టడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జోక్యం చేసుకుని రహదారులు, డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నిరసనలో నాయకులు డి.నారాయణమూర్తి, గుడాల చార్లిస్, కేశ వరపువీరన్న, గొర్లశివ, బొడ్డువెంకటరమణ, పార్వతి,అమ్మాజీ పాల్గొన్నారు.

## నేడు ఎన్టీఆర్ పించన్ల పంపిణీకి సర్వం సిద్ధం

» జిల్లాలో 2.77లక్షల మందికి రూ.116కోట్లు

» సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దే పింఛన్

కలెక్టరేట్(కాకినాడ), జూలై 31: జిల్లాలో ఎన్టీఆర్ పించన్ల పంపిణీకి సర్వం సిద్ధం చేశారు. గురువారం ఉదయం నుంచే జిల్లాలో ఉన్న సచివాలయ ఉద్యోగులు పించన్లు పంపిణీ చేస్తారు. జిల్లావ్యాప్తంగా 2.77లక్షలమందికి రూ.116కోట్ల 77లక్షలను విడుదల చేశారు. తొలిరోజే నూరుశాతం పంపిణీ చేయడానికి జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 1,36,583మంది వృద్ధులకుగాను రూ.54.63కోట్లు కేటాయించారు. వితంతువులు 73,360మంది లబ్ధిదారులకు రూ.29.34కోట్లు, దివ్యాంగులు 35,387మంది లబ్ధిదారులకు రూ.21.23కోట్లు, ఒంటరి మహిళలు 7,874మందికి రూ.3.15కోట్లు విడుదల చేశారు. మత్స్యకారులు 6,375మందికి రూ.2.55కోట్లు, చేనేత కార్మికులు 3,507మందికిగాను రూ.1.40 కోట్లు ఇచ్చారు. గతనెలలో తరహాలోనే పింఛన్‌దారులకు అసౌకర్యం కలగకుండా ఉండేలా కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. సచివాలయ ఉద్యోగులు వారికి కేటాయించిన వార్డులు, కాలనీ పరిధిలో పింఛన్లు పంపిణీ చేస్తారు. మండలాలవారీగా పరిశీలిస్తే గండేపల్లిలో 8522మందికి రూ.3.63కోట్లు, గొల్లప్రోలులో 7814మందికి రూ.3.31కోట్లు, గొల్లప్రోలు అర్బన్‌లో 2943మందికి రూ.1.24కోట్లు కేటాయించారు. జగ్గంపేటకు రూ.5.23కోట్లు, కాజులూరుకు రూ.4.19కోట్లు, కాకినాడరూరల్‌కి రూ.7.65కోట్లు, కాకినాడఅర్బన్‌కి రూ.12.82కోట్లు, కరప మండలానికి రూ.4.82కోట్లు, కిర్లంపూడి మండలానికి రూ.4.83కోట్లు, కోటనందూరుకు రూ.3.33కోట్లు, కొత్తపల్లికి రూ.5.23కోట్లు, పెదపూడికి రూ.4.31కోట్లు, పెద్దాపురం మండలానికి రూ.4.93కోట్లు, అర్బన్‌కి రూ.2.59 కోట్లు ఇచ్చారు. ఎన్టీఆర్‌భరోసా పింఛన్లు తొలిరోజు గురువారమే నూరుశాతం పంపిణీ చేయాలని నిర్ణయించామని, దీనికి తగిన ఏర్పాట్లు చేశాంమని కలెక్టర్ స్పష్టం చేశారు.

### రేపటినుంచి దివ్యాంగులకు ఉపకరణాలు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 31: ఈనెల 2వతేదీ నుంచి జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ చేస్తున్నామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈనెల 2న పిఠాపురంలో ఉన్న రథాలపేట అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో పంపిణీ జరుగుతుందన్నారు. 3న జగ్గంపేట ఎంపీడీవో కార్యాలయంలో, 4న కాకినాడలోని అంబేడ్కర్ భవన్‌లో, 6న తుని మున్సిపల్ కార్యాలయంలో, 7న ప్రత్తిపాడు ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతుందన్నారు. 8న కాకినాడ రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో, 9న పెద్దాపురం అంబేడ్కర్ భవన్‌లో పంపిణీ ఉందన్నారు.

## ఆగిన మీ సేవలు




కాకినాడలోని మీసేవా కేంద్రం

» కేంద్రాల్లో నిలిచిన కార్యకలాపాలు

» రెండు వారాలుగా పనిచేయని సర్వర్లు

» సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల అవస్థలు

పెద్దాపురం/తుని, జూలై 31: మీ సేవా కేంద్రాల్లో రెండువారాలుగా సేవలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా సచివాలయాల్లో ఆశించిన మేరకు సేవలు అందడం లేదు. ప్రధానంగా విద్యా సంవత్సరం ఆరంభం కావడంతో వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు అవస్థలకు గురవుతున్నారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే అక్కడినుంచి వీఆర్వో, ఆర్ఐ, తహశీల్దార్, ఆర్డీవో లాగిన్ వరకూ వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. దీంతో ధృవపత్రాల మంజూరులో జాప్యమవుతోంది.

### వైసీపీ పాలనలో గడ్డు పరిస్థితి..

ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ అనేక సేవలు అందించిన మీసేవ నిర్వాహకుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు సజావుగా అమలయ్యేలా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కిరణ్ కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు మీసేవ సర్వీసులు ప్రారంభించారు. మొదట్లో ఆరు సేవలు అందేవి. తర్వాత టీడీపీ హయాంలో సీఎం చంద్రబాబు మీ సేవలను బలోపేతం చేస్తూ 330 సర్వీసులను పెంచారు. 2017-18లో రూ.5 ఉండే కమీషన్‌ను రూ.10కి పెంచారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మీసేవ నిర్వాహకులకు కష్టాలు మరింత పెరిగాయి. సచివాలయాలకు మీసేవలను బదలాయించడంతో నిర్వహణ కష్టమవుతోందని నిర్వాహకులు వాపోతున్నారు. కనీసం విద్యుత్ బిల్లులు, నెట్ చార్జీలు కూడా రాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈక్రమంలో చాలాచోట్ల మీసేవా కేంద్రాలు మూతబడ్డాయి. జిల్లావ్యాప్తంగా ఉన్న మీసేవా కేంద్రాల ద్వారా రోజుకు 100కు పైగా లావాదేవీలు జరిగేవి. నిర్వాహకులతోపాటు ఆపరేటర్లు సహాయకులు ఉపాధి పొందేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహణాభారంతో చాలా వరకూ కేంద్రాలు మూతబడ్డాయి. ప్రస్తుతం ఉన్న మీసేవా కేంద్రాలు రోజుకు 10 కంటే ఎక్కువ లావాదేవీలు జరగడం లేదని నిర్వాహకులు చెప్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తమను ఆదుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### బకాయిలే కారణమా..?

జిల్లాలో మీసేవా కేంద్రాల్లో ఏపీ ఆన్‌లైన్, రామ్ ఇన్ఫో సీఎంఎస్‌లు సర్వీస్ ప్రొవైడర్లుగా ఉన్నారు. ఈ మూడు సంస్థలు రాష్ట్ర ప్రభుత్వానికి బకాయి పడినట్లు తెలుస్తోంది. దీంతో రెండు వారాల కిందట ప్రభుత్వం మీసేవా కేంద్రాల సర్వీసులను నిలిపివేసింది. ఆయా సంస్థలు కలెక్టర్ల వద్దకు వెళ్లి ప్రభుత్వానికి బకాయిలు ఏమీ లేవని ఎన్‌వోసీలు తెచ్చుకుంటే సర్వీసులు పునరుద్ధరిస్తామని చెప్పినట్లు సమాచారం. ఆయా సంస్థలు ఎన్‌వోసీలు తెచ్చు కో వడంలో జాప్యం చేస్తుండడంతో సేవలు నిలిచాయి. ఒక్కో కేంద్రంలో సగటున రోజుకు 300కు పైగా సేవలను ప్రజలు వినియోగిస్తున్నారు. కుల, ఆదాయ, నివాస, ధ్రువీకరణతోపాటు విద్యుత్, ఆస్తి, నీటి పన్నులు, ఆర్‌టీఏ రిజిస్ట్రేషన్,



రెవెన్యూ, నెట్ బిల్లులు, పోలీస్ వెరిఫికేషన్, సర్టిఫికెట్లు, లేబర్‌శాఖ, విద్యుత్ మీటర్లు, ఇంటి మీటరుకు పేరు మార్పులు, తదితర సేవల కోసం వీటికే వెళ్తుంటారు. సర్వీసు చార్జీలు చెల్లించి నిర్ణీత తేదీకి సర్టిఫికెట్లు పొందుతారు. ఈ సేవలన్నీ నిలిచిపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

● అప్పటి వైసీపీ ప్రభుత్వం కక్ష కట్టి వీధిన పడేసింది

-ఎ.కిరణ్‌కుమార్, మీ సేవా నిర్వాహకుడు, తేటగుంట

ప్రభుత్వం నిర్ణయించిన రుసుము తీసుకుని సేవా దృక్పథంతో ఏడేళ్లుగా పనిచేస్తున్నా. వైసీపీ ప్రభుత్వం కక్ష కట్టి మాకు పని లేకుండా చేసింది. అధికారులనుంచి ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాం.

● కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నాం

-ఐవీ నారాయణ, మీ సేవా అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు, కాకినాడ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సానుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో మా కేంద్రం నుంచి వెళ్లిన దరఖాస్తులు అధికారులు తిరస్కరించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. సర్వీసులు పునరుద్ధరించాలని కోరుతున్నారు. కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నాం.



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

## కాకినాడలో ఎలక్ట్రిక్ బైక్ దగ్ధం

కాకినాడ క్రైం, జూలై 31: సాంకేతిక సమస్య తలెత్తి ఓ ఎలక్ట్రిక్ బైక్ దగ్ధమైన సంఘటన బుధవారం కాకినాడలో చోటు చేసుకుంది. కాకినాడ రూరల్ మండలం సర్పవ రానికి చెందిన వాసంశెట్టి దేవసంతోష్ తన టీవీఎస్ ఐ క్యూబ్ ఎలక్ట్రిక్‌బైక్‌పై బుధవారం సర్పవరంనుంచి కల్పనా సెంటర్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో అతడి బైక్ ఆనందభారతి గ్రౌండ్‌వద్దకు వచ్చేసరికి వాహనంలో నుం చి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అతను వాహనా న్ని గ్రౌండ్‌లోకి తీసుకుని వెళ్లి కింద పడవేసి దూరంగా పరిగెత్తాడు. సమాచారం అందుకున్న సాలిపేట అగ్నిమాపకాధికారి వి.సుబ్బారావు సిబ్బంది, శకటంతో సంఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే వాహనం పూర్తిగా దగ్ధమైంది. దాని విలువ రూ.1.20లక్షలు ఉంటుందని ఏడీఎఫ్‌వో సుబ్బారావు తెలిపారు.

### సైస్ కంప్యూటర్ సంస్థతో పీఆర్ కాలేజీ ఎంవోయూ

కార్పొరేషన్(కాకినాడ), జూలై 31: నైపుణ్య శిక్షణ, ప్లేస్‌మెంట్ కల్పనపై పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎంవోయూ కుదుర్చుకుంది. ప్రముఖ సైస్ కంప్యూటర్ సంస్థతో బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసుకున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.తిరుపాణ్యం మాట్లాడుతూ సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యార్థులు మంచి ఉద్యోగావకాశాలు పొందేందుకు ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థులకు ఈరెండు సంస్థల ద్వారా ధృవీకరణ పత్రాలు జారీ చేయడంతోపాటు ప్లేస్‌మెంట్ కల్పిస్తారన్నారు. ఒప్పందంపై ప్రిన్సిపాల్ తిరుపాణ్యం, సైస్ కంప్యూటర్ సంస్థ డైరెక్టర్ జంగం బాబై సంతకాలు చేశారు.

## కాకినాడ ఎస్‌డీపీవోపై బదిలీ వేటు



హనుమంతురావు (ఫైల్)

కాకినాడ క్రైం, జూలై 31: కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి(ఎస్‌డీపీవో) డాక్టర్ కె.హనుమంతురావుపై బదిలీ వేటు వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన ఈ ఏడాది ఫిబ్రవరి 5న కాకినాడ ఎస్‌డీపీఓగా విధుల్లో చేరారు. గతప్రభుత్వ విధానాలకు అణువుగా అతడి వ్యవహార్శైలి ఉండేది. పూర్తిగా వైసీపీ పక్షపాతిగా ఆయన ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఎన్నికల సమయంలో పిఠాపురం ఎన్నికల ప్రచారానికి వచ్చిన సినీహీరో సాయిధరమ్‌తేజ్‌పై వైసీపీవర్గాలు దాడికి పాల్పడిన నేపథ్యంలో నిందితులపై చర్యలు తీసుకోకపోవడం వివాదాస్పదమైంది.అనంతరం పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ కారుపై దాడి జరిగిన ఘటనలోను పెద్దగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఈ విషయాలపై డీజీపీ కార్యాలయంలో పోస్టుమార్టం తర్వాత ప్రస్తుతం ఆయనపై బదిలీ వేటు పడింది. ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా హెడ్‌క్వార్టర్స్‌కు రిపోర్ట్ చేయాలని బదిలీల లిస్టులో పేర్కొన్నారు. త్వరలోనే కాకినాడకు కొత్త ఎస్‌డీపీవోను ప్రభుత్వం నియమించనుంది.

### మహిళల రక్షణపై ప్రత్యేక దృష్టి: ఎస్పీ



సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం, జూలై 31: మహిళల రక్షణపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ, సెమినార్ హాల్లో ఆయన బుధవారం నెలవారీ నేర సమీక్షను నిర్వహించారు. ఈ సమీక్షకు కాకినాడ, పెద్దాపురం సబ్‌డివిజన్‌ల ఇన్‌స్పెక్టర్‌లు, సబ్ ఇన్‌స్పెక్టర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, పోక్సోచట్టం, గంజాయి అక్రమ రవాణా కేసులపై ప్రత్యేక శ్రద్ధపెట్టి, నేరస్తులను త్వరిత గతిన అరెస్ట్ చేసి సకాలంలో దర్యాప్తును పూర్తి చేసి నేరస్తులకు శిక్ష పడేలా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా మైనర్ ఆడపిల్లలు, మహిళల రక్షణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి వారి సమస్యలపై సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమైన పబ్లిక్, ప్రైవేట్ సముదాయాల్లో సీసీటీవీల ఏర్పాటుపై సంబంధిత నిర్వాహకులతో సంబంధిత పోలీస్ అధికారి సంప్రదింపులు చేయాలన్నారు. సమీక్షలో అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కర్‌రావు, సెబ్ అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## విద్యాకమిటీ ఎన్నికలకు మోగిన నగారా



» పేరెంట్స్ కమిటీ పేరు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీగా మార్పు

» నేడు నోటిఫికేషన్ విడుదల » 8న ఎన్నిక

» ఎన్నికల్లో రాజకీయ జోక్యాన్ని నిషేధించిన ప్రభుత్వం

తొండంగి/సామర్లకోట, జూలై 31: పాఠశాల యాజమాన్య కమిటీలకు ఎన్నికల నగారా మోగింది. ఈనెల 1న గురువారం అన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయలు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. గతంలో ఎస్ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ)గా ఉన్న పేరును వైసీపీ ప్రభుత్వం పేరెంట్స్ కమిటీగా మార్పు చేసి 2022, సెప్టెంబరు 21న ఎన్నికలు నిర్వహించారు. వీటి పదవీకాలం 2023, సెప్టెంబరు 21తో ముగిసినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల కోడ్ తదితర కారణాలతో 24-25 విద్యాసంవత్సరం ప్రారంభం వరకూ కొనసాగేలా ప్రభుత్వం పొడిగింపు ఉత్తర్వులు ఇచ్చింది. దీనిప్రకారం ఇప్పటివరకూ గత కమిటీలే కొనసాగాయి. తాజాగా ప్రభుత్వం పేరెంట్స్ కమిటీ పేరును స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీగా మార్పు చేస్తూ ఎన్నికలు జరిపేందుకు సిద్ధమైంది. గతంలో జరిగిన ఎన్నికల్లో వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధులు తమకు నచ్చిన వ్యక్తిని చైర్మన్‌గా ఎంపిక చేసుకునేందుకు అడ్డదారుల్లో ప్రయత్నించి విజయం సాధించారు. నాడు-నేడు పథకం కింద పాఠశాలల అభివృద్ధికి నిధులు విడుదల కావడంతో వాటిని చైర్మన్ పదవిని అడ్డంపెట్టుకుని నొక్కేసే లక్ష్యంతో ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కొన్నిచోట్ల ఘర్షణ వాతావరణం సృష్టించి ప్రత్యర్థులను అడ్డుకుని ఎన్నికలను వాయిదా వేయించారు.

### వైసీపీ హయాంలో రాజకీయ వేదికలుగా...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వైసీపీ నేతల కనుసన్నల్లో ఎన్నికలు జరిగాయి. 4266 పాఠశాలల్లో ఎన్నికలు జరగ్గా ప్రత్యర్థులు బలంగా ఎదుర్కోవడంతో ఆరు పాఠశాలల్లో ఘర్షణలు, కోరం లేకపోవడం తదితర కారణాలతో ఎన్నికలు వాయిదా వేశారు. వాటిని ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో రెండోవిడతలో నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో నడపాల్సిన పాఠశాలలను రాజకీయ వేదికలుగా వైసీపీ నేతలు మార్చడంతో అనేకమంది ప్రధానోపాధ్యాయులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురయ్యారు. పనులన్నీ వైసీపీ నేతలు చేసి చెక్కులపై సంతకాలు చేసేందుకు మాత్రమే ప్రధానోపాధ్యాయులను ఉపయోగించుకున్నారు. భవిష్యత్తులో వచ్చే పరిణామాలకు తామే బాధ్యత వహించాల్సి వస్తుందన్న భయం ఉన్నా నాయకులు చెప్పినట్లు చేయాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నారు.

### రాజకీయ జోక్యం లేకుండా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా విద్యాకమిటీల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిప్రకారం కాకినాడ జిల్లాలో 1281 పాఠశాలల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల్లో ఎట్టిపరిస్థితుల్లోను రాజకీయ జోక్యం ఉండకూడదని తెగేసి చెప్పింది. నోటిఫికేషన్‌లో కూడా దీన్ని స్పష్టం చేసింది.మధ్యాహ్న భోజనం, ఇతర అభివృద్ధి పనుల పర్యవేక్షణ, పిల్లల అవసరాలకు సంబంధించి కమిటీ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల్లో కూడా తల్లిదండ్రుల నుమినహాయించి బయటి వ్యక్తులు ఎవరినీ లోనికి అనుమతించవద్దని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో గతానికి భిన్నంగా ప్రశాంత వాతావరణంలో తల్లిదండ్రులు తమకు నచ్చిన వ్యక్తుల్నే చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఎన్నుకునే అవకాశం కల్పించింది. ఇది శుభపరిణామమని విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాల నేతలు పేర్కొంటున్నారు. పాఠశాలస్థాయిలో ఏర్పాటు చేసే ఫ్లెక్సీలు బ్యానర్లపై ముఖ్యమంత్రితో సహా ఎవరి పేరు ఫొటో పెట్టొద్దని విద్యాశాఖా మంత్రి లోకేశ్ ఆదేశించడాన్ని వారు ఉదాహరణగా చూపుతున్నారు.

### 8న ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు: డీఈవో

కాకినాడ రూరల్, జూలై 31: ఈనెల 8న 2024-25 సంవత్సరానికిగాను జిల్లాలోని అన్నిప్రభుత్వ పాఠశాలల్లోనూ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసినట్లు డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు తరగతి వారీగా విద్యార్థుల తల్లిదండ్రుల లిస్టును గురువారం సదరు పాఠశాలల్లో ప్రదర్శించాలన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు, సంబంధిత రెవెన్యూ, మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సహకారంతో ప్రతి పాఠశాలలోనూ ఈప్రక్రియను సక్రమంగా నిర్వహించాలన్నారు.

## పిఠాపురం నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటా : ఎమ్మెల్సీ హరిప్రసాద్

పిఠాపురం, జూలై 31: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో పిఠాపురం నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటానని ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ ప్రకటించారు. గురువారం పిఠాపురం నియోజకవర్గంలో జరిగే పింఛన్ల పంపిణీలో పాల్గొనేందుకు బుధవారం రాత్రి ఆయనతోపాటు జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు పిఠాపురం చేరుకున్నారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ ఎమ్మెల్సీకి ఒక నియోజకవర్గాన్ని ప్రొటోకాల్‌పరంగా సొంత నియోజకవర్గంగా ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. పిఠాపురాన్ని దత్తత తీసుకుంటానని ఎమ్మెల్సీ హరిప్రసాద్ ప్రకటించడంతో ఆయన ఈ నియోజకవర్గాన్ని ఎంపిక చేసుకుంటారని పలువురు భావిస్తున్నారు.


## నిలకడగా గోదారి

» 10.41 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి

» కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక

- 7లో


## నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగాల భర్తీ

» అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలను రద్దు చేయండి

» పిఠాపురం మునిసిపల్ కౌన్సిల్ రిక్విజిషన్ సమావేశంలో తీర్మానం

» సాధారణ సమావేశం బహిష్కరణ, వాయిదా

పిఠాపురం, జూలై 31: కౌన్సిలర్లకు సమాచారం లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా జరిగిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియమాకాలను రద్దు చేయాలని పిఠాపురం మునిసిపల్ సమావేశం తీర్మానించింది. పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయం కౌన్సిల్ హాలులో బుధవారం జరిగిన మునిసిపల్ కౌన్సిల్ రిక్విజిషన్ సమావేశానికి చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షత వహించారు. సమావేశం ప్రారంభం కాగానే వైసీపీ కౌన్సిలరు బొజ్జా జగదీశ్వరీ మాట్లాడుతూ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియమాకం ఫైల్ తయారు చేసిన ఉద్యోగిని పిలిపించాలని కోరారు. సదరు ఉద్యోగి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని కమిషనరు కనకారావు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఆదేశాలతో ఉద్యోగాల భర్తీకి చైర్‌పర్సన్ సిఫారసుతో అప్పటి కమిషనరు కలెక్టరుకు లేఖ రాశారని, కలెక్టరు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమోదించిన తర్వాత ఆప్కాస్ ద్వారా నియమాకాలు జరిగినట్లు వివరించారు. ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ నోటిఫికేషన్ ఇవ్వకుండా ఉద్యోగాలను ఎలా భర్తీ చేస్తారని, కొవ్వూరు, రామచంద్రపురం పురపాలక సంఘాల్లో ఇలా జరిగితే అక్కడ కౌన్సిల్ తిరస్కరించారని తెలిపారు. మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇలాకాలో ఇలాగే చేశారని, అక్కడ కోట్లాదిరూపాయిల అవినీతి జరిగిందని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు చేయడం తగదని సోమరౌతు లలిత అన్నారు. ఒక ఉద్యోగిని తీసుకోవాలంటే నిబంధనలు ఉంటాయి కదా అని పెదపాటి నాగేశ్వరరావు ప్రశ్నించారు.ఆప్కాస్ వచ్చిన తర్వాత అవుట్‌సోర్సింగ్ నియమాకాలు అన్నీ జిల్లా కలెక్టరు సిఫారసుతో కలెక్టరు ద్వారానే జరుగుతున్నాయని కమిషనర్ వివరించారు. కలెక్టరు ఆమోదంతోనే నియామకాలు జరిగాయని, ఇందులో అవకతవకలకు తావులేదని స్పష్టంచేశారు. కౌన్సిల్‌కు తెలియకుండా కౌన్సిలర్లను అవమానపరిచేలా నియామకాలు జరిగాయని, అందువల్ల వాటిని రద్దు చేసి నోటిఫికేషన్‌ఇచ్చి రోస్టర్ పద్ధతిలో మళ్లీ కొత్తగా నియామకాలు జరపాలని తలిశెట్టి వెంకటేశ్వరరావు సూచించారు. చైర్‌పర్సన్ సిఫారసుతోనే ఇవన్నీ జరిగినందున ఆమెకు కుర్చీలో కూర్చొనే అర్హత లేదని టీడీపీ ఫ్లోర్ లీడర్ అల్లవరపు నగేష్ అన్నారు. తాను నిబంధనల ప్రకారమే వ్యవహరించానని, మాజీ ఎమ్మెల్యే సిఫారసు మేరకే లేఖ రాసినట్లు చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి తెలిపారు.

### అన్నక్యాంటీన్ మరమ్మతులపై..

కాగా అన్నక్యాంటీన్ భవనాలకు అత్యవసరంగా మరమ్మతులు నిర్వహిస్తూ మునిసిపాలిటీ ఆదాయం తెచ్చి పెట్టే మునిసిపల్ గెస్ట్‌హౌస్‌కు మరమ్మతులు నిర్వహించకపోవడంపై వైసీపీ కౌన్సిలరు బోను దేవ సమావేశంలో నిల్చొని నిరసన తెలిపారు. దీనికి టీడీపీ కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. పేదవారికి అన్నం పెట్టే అన్నక్యాంటీన్‌కు మరమ్మతులు నిర్వహిస్తే అభ్యంతరం తెలుపుతారా అంటూ కౌన్సిలర్లు అల్లవరపు నగేష్, పంపనబోయిన అన్నపూర్ణ, రాయుడు శ్రీను, కోళ్ల బంగారుబాబు మండిపడ్డారు. రిక్విజిషన్ సమావేశం ముగిసిన తర్వాత సాధారణ సమావేశాన్ని ప్రారంభిస్తుండగా కౌన్సిలర్లు అందరూ తాము చైర్మన్ వైఖరిని నిరసిస్తూ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు. దీనితో సమావేశాన్ని వాయిదా వేశారు.

## రేషన్‌బియ్యం నాణ్యతపై సర్వే

» జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), జూలై 31: ప్రజలకు పంపిణీ చేస్తున్న రేషన్‌బియ్యం నాణ్యతపై సర్వేచేసి కార్డుదారుల నుంచి అభిప్రాయాలు సేకరించాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం పౌరసరఫరాశాఖ, తూనికలు కొలతల శాఖ, వ్యవసాయశాఖ, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ, మహిళా శిశుసంక్షేమశాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్‌కార్డుదారులకు అందిస్తున్న సరుకుల నాణ్యతపై తీసుకున్న అభిప్రాయాల నివేదికను సమర్పించాలన్నారు. పటిష్ట అమలుకు దీన్ని నిర్వహిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఇస్తున్న పోర్టిఫైడ్ బియ్యం బాగుందని, ఇంకా నాణ్యమైన సన్న బియ్యం ఇస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడ్డారు. సమావేశంలో డీఆర్‌వో తిప్పే నాయక్, డీఎస్‌వో ప్రసాద్, సివిల్ సప్లయిస్ డీఎం బాల సరస్వతి, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

### పోలవరం పునరావాస కల్పనే..

# వరదలకు శాశ్వత పరిష్కారం

- పోలవరం గరిష్ఠ స్థాయిలో గోదావరి వరద ముంపు
- గతంలో చింతూరు ఐటీడీఏ పీవో నివేదికను పట్టించుకోని జగన్ ప్రభుత్వం

(రంపచోడవరం)



విలీన మండలాల్లో ముంపులో ఓ గ్రామం

గోదావరి పరీవాహక ప్రాంతంలోని గిరిజన ఆవాసాలను ముంచెత్తిన వరదలు గరిష్ఠ స్థాయిలో పోలవరం ప్రాజెక్టు కింద చోటుచేసుకునే స్థాయి ముంపును సృష్టించాయి. 2020 నుంచి ఈ పరిస్థితులు ఎదురవుతున్నా వరద ముంపును నిరోధించే శాశ్వత చర్యలు కొరవడుతున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఐదు మండలాల్లో పోలవరం ప్రాజెక్టు కింద 236 ఆవాసాలు ముంపునకు గురవుతుండగా 67,503 కుటుంబాల వారు నిర్వాసితులుగా ఉన్నారు. మొదటి దశలో 101 ఆవాసాలు ముంపునకు గురవుతున్నాయి. వీటిలో దేవీపట్నం మండలంలోని 46 ఆవాసాలు ఇప్పటికే ఖాళీ అయ్యాయి. ఇక నాలుగు విలీన మండలాల్లోని 190 ఆవాసాల్లో పునరావాసం అమలుకావాల్సి ఉంది. కాగా పోలవరం ప్రాజెక్టు పూర్తి కాకుండానే వరదలు ఈ ఆవాసాలకు పోలవరం ప్రాజెక్టు ముంపు కష్టాల్ని రుచి చూపిస్తున్నాయి. 2020 నుంచి తాజా వరదల వరకు నాలుగు విలీన మండలాల్లో 134 ఆవాసాలు తరచూ ముంపును ఎదుర్కొంటున్నాయి. 1986నాటి తీవ్ర వరదలను లెక్కచేయని విలీన మండలాల గ్రామాలను పోలవరం కాఫర్‌డ్యామ్‌తో ముంపు తీవ్రత పెరిగి వరదలు కలవరపెడుతున్నాయి. గతంలో పోలవరం వద్ద 14 మీటర్ల స్థాయిలోనే గోదావరి ధవళేశ్వరం ఆనకట్టవైపు సులభంగా వెళ్లిపోయేది. ఇప్పుడు 40 మీటర్లు మించితేగానీ వెళ్లని పరిస్థితి కాఫర్ డ్యామ్, పోలవరం స్పిల్‌వే కారణంగా నెలకొంది. ఏ స్థాయిలో ఎన్ని క్యూసెక్కుల నీరు కిందకు వెళ్తుందో ఇంజనీర్లు ఇప్పటికే పేర్కొన్నారు. ఇటీవల పోలవరం కాఫర్ డ్యామ్ వద్ద నీటిమట్టం సుమారు 35 మీటర్ల వరకూ వెళ్లింది. ఈ స్థాయికి మించి 41.15 మీటర్ల స్థాయిలో మొదటి దశగా పోలవరం ప్రాజెక్టు కింద నీటిని నిల్వచేసినా విలీన మండలాల్లో 60 ఆవాసాలు మాత్రమే ప్రభావానికి లోను కావాల్సి ఉండగా వరదలు 134 ఆవాసాలను ముంచుతున్నాయి. ఇది ఏకంగా పోలవరం ముంపు లెక్కలనే తప్పుబట్టేలా ఉంది. 2019, 2020 వరదల్లో అసంపూర్ణంగా ఉన్న కాఫర్ డ్యామ్ కారణంగానే వరద తీవ్రత పోలవరం గరిష్ఠ స్థాయి... అంటే 45.72 మీటర్లలో మునిగే గ్రామాలు వరదల్లో చిక్కుకున్నాయని చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి 2021లో ప్రభుత్వానికి ఇచ్చిన ఒక నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారు. తరచుగా వచ్చే వరదల నుంచి విలీన మండలాల్లోని గ్రామాలను కాపాడాలంటే నిర్వాసితులకు పునరావాస కాలనీలను తక్షణం నిర్మించాలని పరోక్షంగా సూచించారు. ఈ ముంపు గ్రామాల కోసం 110 కాలనీలను పూర్తి చేయాల్సి ఉంది. అయితే గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం విలీన మండలాల కోసం ఒక్క కాలనీని పూర్తి చేయలేదు. కూటమి ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకుని న్యాయం చేస్తుందని విలీన మండలాల ప్రజలు ఆశిస్తున్నారు.

# బొమ్మూరు డైట్ కళాశాలలో అరాచకం

- విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- కలెక్టర్ ఆదేశాలతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పీడీ విచారణ
- ఇద్దరు అధ్యాపకుల సస్పెండ్?
- ఇద్దరు సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు
- అమరావతిలో రిపోర్టు చేయాలని ప్రిన్సిపాల్‌కు ఆదేశాలు

రాజమహేంద్రవరంరూరల్/సిటీ, జూలై31: బొమ్మూరు డైట్ కళాశాలలో లైంగిక వేధింపుల పట్ల విచారణ జరిపి ఇద్దరు అధ్యాపకులను సస్పెండ్ చేసినట్టు తెలిసింది. తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులోని ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) కళాశాలలో తెలుగు అధ్యాపకుడు బాలరాజు, పీఈటీ వీరభద్రరావు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్టు సుమారు 15 రోజుల కిందట డీఎడ్ కోర్సు చదువుతున్న విద్యార్థినులు ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. కళాశాలలో ఇద్దరు అధ్యాపకులు, మరికొంతమంది నాన్‌టీచింగ్ స్టాఫ్ కలిసి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్టు విద్యార్థినులు ఫిర్యాదు పేర్కొన్నారు. ఈ విషయాన్ని డైట్ క్యాంపస్‌లోనే బయటపెట్టాలని ప్రయత్నించినా కొంతమంది నాన్‌టీచింగ్ స్టాఫ్ భయపెట్టడంతో వెనక్కి తగ్గినట్టు తెలిసింది. దీంతో విద్యార్థినులు ఎవరికి తెలియకుండా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం విచారణకు ఆదేశించారు. ఈ మేరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధురి, ఐసీడీఎస్ పీడీ విజయకుమారి కళాశాలలో విచారణ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి జరిగిన వాస్తవాలు తెలుసుకున్నారు. కళాశాలలో జరిగిన చాలా విషయాలు బయటకు వచ్చాయి. లైంగిక వేధింపులతోపాటు భవన నిర్మాణాల్లో అక్రమాలు, దోపిడీ, నాన్‌టీచింగ్ స్టాఫ్‌లో ఇద్దరు కింది స్థాయి ఉద్యోగుల అరాచకాలు, విద్యార్థినుల నుంచి అదనంగా ఫీజుల పేరుతో వసూళ్లు, మౌలిక సదుపాయాల లేమి వంటి అంశాలు బయటకు వచ్చాయి. ఆయా అంశాలపై విచారణ కొనసాగించారు. నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను విచారించారు. కళాశాల ప్రిన్సిపాల్ జయశ్రీకి ఫిర్యాదుచేసినా పట్టించుకోకపోవడంతో ఉన్నతాధికారులను ఆశ్రయించినట్టు విద్యార్థినులు తెలిపారు. కళాశాలలోని ఇద్దరు అటెండర్లు ప్రిన్సిపాల్‌నే బెదిరింపులకు గురిచేసిన సంఘటనలు జరిగినట్టు తెలిసింది. విచారణలో భాగంగా తెలుగు అధ్యాపకుడు బాలరాజు, పీఈటీ వీరభద్రరావుల తీరుపై విచారణ అధికారిణి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ప్రిన్సిపాల్ జయశ్రీ ఈ ఏడాది ఏప్రిల్‌లో కళాశాలకు ప్రిన్సిపల్‌గా వచ్చారు. విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో అమరావతిలో రిపోర్టు చేయాలని కలెక్టర్ ఆదేశించినట్టు తెలిసింది. మరొక ఇద్దరు నాన్‌టీచింగ్ స్టాఫ్‌పై శాఖాపరమైన చర్యలకు ఆదేశాల్చినట్టు తెలిసింది. కళాశాలలో సరైన పర్యవేక్షణలేకపోవడం, భద్రత లేకపోవడం, అటెండర్లు నిబంధనలు పాటించకపోవడం విచారణ అధికారికి ఆశ్చర్యం కలిగించాయి. కళాశాలలో రూ.80 లక్షలతో చేపట్టిన నాడు-నేడు పనుల రికార్డులను తనిఖీ చేసి చేపట్టిన పనులు పరిశీలించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు.

# రుణాల పేరుతో భారీగా సొమ్ములు స్వాహా

- వెలుగులోకి వస్తున్న యానిమేటర్ అక్రమాలు
- మరోమారు డీఆర్డీఏ అధికారుల విచారణ



పిఠాపురం మండలం బి.కొత్తూరులో విచారణ నిర్వహిస్తున్న డీఆర్డీఏ అధికారులు

పిఠాపురం రూరల్, జూలై 31: రుణాల పేరుతో యానిమేటర్ భారీగా సొమ్ములు స్వాహా చేసినట్టు వచ్చిన ఆరోపణలపై డీఆర్డీఏ అధికారులు విచారణ చేపట్టారు. మహిళా సంఘాల సభ్యుల పేరు మీద రూ.4 కోట్లు మేర రుణాలు తీసుకుని యానిమేటర్ పక్కదారి పట్టించినట్టు వెల్లడైంది. పిఠాపురం మండలం బి.కొత్తూరు గ్రామంలోని మహిళా శక్తి సంఘాల సభ్యుల పేరుపై పిఠాపురానికి చెందిన యానిమేటర్ పద్మకుమారి రుణాలు తీసుకుని వాటిని చెల్లించకపోవడంతో ఏడు బ్యాంకుల నుంచి మహిళలకు నోటీసులు అందాయి. దీనిపై వారు తాము రుణాలు తీసుకోకుండా నోటీసులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. ఇప్పటికే ఒకసారి విచారణ నిర్వహించిన అధికారులు బుధవారం మరోమారు విచారణ చేపట్టారు. డీఆర్డీఏ డీపీఎం వి.పద్మావతి, ఏపీపీ ప్రియదర్శిని, పిఠాపురం బ్యాంక్ ఆఫ్ బరోడా, డీసీసీబీ, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు, ఐవోబీ, విరవాడ, పిఠాపురం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు అధికారులు 184 మంది మహిళలను విచారించారు. తాము ఒక్క రుణం మాత్రమే తీసుకున్నామని, మూడు, నాలుగు రుణాలు తీసుకోలేదని 40 మందికి పైగా మహిళలు చెప్పారు. యానిమేటర్ తీసుకున్న రుణాలు రూ.4కోట్లుపైగా ఉన్నాయని గుర్తించారు. యానిమేటర్ తమ పేరుపై ఎన్ని రుణాలు తీసుకుందో తెలియజేయాలని మహిళలు డిమాండ్ చేశారు. లెక్కలు తర్వాత చెప్తామంటూ అధికారులు వెళ్లిపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణలో ఎల్‌సీలు రమేష్, రామకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.





రావులపాలెంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు, కేవీ, ఆకుల.. విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆనం

# అన్ని ఆలయాల అభివృద్ధికి కృషి

దేవదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

రావులపాలెం, జూలై 31: 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంక్షేమం, అభివృద్ధి ఏవిధంగా చేయాలన్న అంశంపై ముందుకు వెళ్తోంది.. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని నరేంద్రమోదీ, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సహకారాలతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు బాటలు వేస్తున్నారని' దేవదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. రావులపాలెంలోని మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి స్వగృహానికి బుధవారం రాత్రి ఆయన వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, అయితాబత్తుల ఆనందరావు, నాయకులు కేవీ, ఆకుల రామకృష్ణ, బండారు సంజీవ్‌లు ఆయనకు ఘనస్వాగతం పలికి ఆయనను సత్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను అభివృద్ధిపరిచేందుకు కృషిచేస్తామన్నారు. అర్చకులకు సరైన విధానం లేదు, వారు నిత్యపూజలు చేయడానికే ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలో 5400పైబడి దేవాలయాలకు దూపదీప నైవేద్యాలకు నగదు అందిస్తున్నాం. ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం రూ.10 వేలు ఇస్తామని ప్రకటించాం. దేవదాయశాఖపై రూ.32 కోట్లు అదనపు భారం పడుతునప్పటికీ ఇవ్వడానికే కట్టుబడి ఉన్నామన్నారు. రూ.50 వేలు ఉన్న దేవాలయాల్లో ఉన్న అర్చకులకు రూ.10 వేల నుంచి రూ.15 వేలు అందించడం జరుగుతుందన్నారు. ఆలయాలకు పాలకవర్గ సభ్యులను, అధి కారులను నియమించడం జరుగుతుందన్నారు. ఆలయాల ప్రక్షాళన మొదలుపెడతామన్నారు. టీటీడీలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఓ వ్యక్తి పరకామణిలో తొమ్మిది అమెరికన్ డాలర్లు దోచుకుంటే ఆ వ్యక్తిని పట్టుకుని కేసు పెట్టడం జరిగిందని, 72వేల విలువైన నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. అయితే ఆ వ్యక్తి పశ్చాత్తాపపడి రూ.14.50 కోట్లు టీటీడీ దేవస్థానానికి ఇస్తానని చెప్పడం జరిగిందన్నారు. దీన్నిబట్టి చూస్తే వైసీపీ పాలనలో ఎన్ని కోట్లు మేర దోపిడీ జరిగిందో తేటతెల్లమైందన్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపడతామన్నారు. ఉమ్మడి రాష్ట్రం విడిపోయినప్పటి నష్టం కన్నా వైసీపీ పాలన అధిక నష్టం రాష్ట్రానికి చేకూర్చిందన్నారు. దాదాపు 58 వ్యవస్థలు, డిపార్టుమెంట్లు గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్వీర్యం అయిపోయాయన్నారు. నాయకులు చిలువూరి సతీష్‌రాజు, గుత్తుల పట్టాభిరామారావు, కొవ్వూరి జగన్నాధరెడ్డి, చిన్న కేవీ, వెలగల శ్రీనివాసరెడ్డి, జక్కంపూడి వెంకటస్వామి, కోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.





### మైమరిచేలా..

ఏజెన్సీ అందాలను ఎంతసేపు చూసినా తనివితీరదు. మన్యం అంతటా కొద్దిరోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షం కొంతసేపు పడి తెరిపిచ్చాక.. ఆ సమయంలో కొండల్లోంచి కనిపించే పొగ మంచు అందాలు స్థానికులను, పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. చింతూరు మండలం మోతుగూడెం సమీపంలోని సుకుమామిడి వద్ద బుధవారం ఇలా పొగమంచు అందాలు మైమరిపించాయి. - మోతుగూడెం



రాజమహేంద్రవరం మార్కెండేయస్వామి గుడి వద్ద టీటీడీ ఘాట్‌లో వరద ఉధృతి

# నిలకడగా గోదారి

- 10.41 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి
- కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక

ధవళేశ్వరం,జూలై31: ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. బుధవారం తెల్లవారుజామున 4గంటలకు 12.10 అడుగుల వరకు తగ్గిన నీటిమట్టం ఆపై 1 5గంటలుగా నిలకడగా కొనసాగుతోంది. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 10,41,489 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. రాత్రి 8 గంటలకు నీటిమట్టం నిలకడగా 12.10 అడుగుల వద్ద ఉంది. ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరద ప్రవాహంతో ధవళేశ్వరం వద్ద నీటిమట్టం తగ్గకుండా నిలకడగా ఉంది. గురువారం ఉదయం వరకు నీటిమట్టం నిలకడగా కొనసాగి తగ్గుముఖం పట్టవచ్చని ఆపై గంటల వ్యవధిలోనే మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించే స్థాయికి నీటిమట్టం తగ్గుతుందని అధికారులు అంచనా. కాగా ఎగువన భద్రాచలం వద్ద మంగళవారం అర్ధరాత్రి వరకు పెరిగిన నీటిమట్టం 45.10 అడుగుల వరకు చేరుకుని కొద్ది గంటలు నిలకడగా ఉండి ఆపై తగ్గుముఖం పడుతుంది. బుధవారం రాత్రి 8గంటలకు నీటి 44.70అడుగులుగా నమోదైంది. కాగా ఎగువ ప్రాంతాల్లో నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. బుధవారం సాయంత్రానికి కాళేశ్వరం వద్ద 9.85 మీటర్లుగా నీటిమట్టం నమోదుకాగా, పేరూరు వద్ద 15.48 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 12.17 మీటర్లు, భద్రాచలం వద్ద 44.70 అడుగులు, కూనవరం వద్ద 19.06మీటర్లు, కుంట వద్ద 10.37మీటర్లు, పోలవరం వద్ద 12.36 మీటర్లు, రాజమండ్రి రైల్వే బ్రిడ్జి వద్ద 16.12మీటర్లుగా నీటి మట్టం నమోదైంది.



సైకిల్‌తో సోకులేరు వాగు దాటుతున్న లక్కగూడెం గ్రామస్తుడు జోగయ్య

## ప్రాణాలతో చెలగాటం

### సోకులేరు వాగులో రాకపోకలు

మోతుగూడెం, జూలై 31: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న చదలవాడ పంచాయతీ సోకులేరు వాగు పదిరోజులుగా కురుస్తున్న వర్షాలు పొంగి బుధవారం కాస్త తగ్గింది. దాంతో మిట్టవాడ, చౌయులూరు, లక్కగూడెం, చదలవాడ గ్రామ ప్రజలు నిత్యావసర సరుకులు, వైద్యానికి సోకులేరు వాగు దాటారు. బుధవారం చింతూరు సంతకు వచ్చి అవసరమైన నిత్యావసర సరుకులను, ఆహార పదార్థాలను కొనుగోలు చేసుకుని తిరిగి సాయంత్రానికి తమ స్వగ్రామానికి వెళ్లారు. నిండుగా ప్రవహిస్తున్న ఏరులో రాకపోకలు సాగిస్తుండడంతో ప్రమాదం గుప్పెట్లో సాహసయాత్రలా ఉంటోంది. లక్కవరం గ్రామస్తుడు కలుముల జోగయ్య అనే వ్యక్తి చింతూరు సంతకు వెళ్లేందుకు సోకులేరు వాగులో ఏకంగా తన సైకిల్‌ను భుజంపై పెట్టుకుని వాగు దాటారు. ప్రతిసారి ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని ఏరు దాటుతున్నామని, అసంపూర్తిగా నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి చేయాలని వారంతా కోరుతున్నారు.



మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంటి వద్ద ఘర్షణ పడుతున్న యువకుడు

## పెద్దాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్‌పై దాడికి యత్నం

పెద్దాపురం, జూలై31: పెద్దాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొద్దు తులసీ మంగతాయారుపై బుధవారం ఓ యువకుడు దాడికి యత్నించాడు. స్థానిక వరహాలయ్యపేటలో నివసిస్తున్న ఛైర్‌పర్సన్ కుటుంబానికి అదే ప్రాంతంలో నివసిస్తున్న యువకుడు తానారి సోమరాజు కుటుంబానికి కుటుంబ విషయాలకు సంబంధించి వివాదాలు జరుగుతున్నాయి. కౌన్సిల్ సమావేశం ముగించుకుని ఇంటికి వెళ్లిన ఛైర్‌పర్సన్ ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకున్న సోమరాజు మద్యం సేవించి ఛైర్‌పర్సన్ ఇంటి వెళ్లి తలుపులు బద్దలు కొట్టేందుకు ప్రయత్నం చేశాడు. ఆమెను దుర్భాషలాడుతూ హంగామా సృష్టించాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో సమీపంలో ఉన్నవారు వచ్చి యువకుడిని నిలువరించే ప్రయత్నం చేశారు. దీంతో ఆ యువకుడు దాడికి ప్రయత్నం చేయడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై వెలుగుల సురేష్ అక్కడికి చేరుకుని ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలిసిన వెంటనే వైసీపీ పెద్దాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు, వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కౌన్సిలర్లు అక్కడకు చేరుకుని ఆమెకు అండగా నిలిచారు. ఛైర్‌పర్సన్‌పై దాడిని ఖండించారు.

## అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



ఏలేశ్వరం, జూలై 31: కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలో సి.రాయవరం గ్రామంలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందాడు. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గజ్జి అప్పన్న (60) ఊట గుంటలో మృతిచెంది ఉండగా స్థానికులు గుర్తించారు. మృతదేహంపై గాయాలు ఉండడంతో పలువురు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు.

## 'ఎరువుల నియంత్రణ చట్టం సమర్థంగా అమలు'

రాజమహేంద్రవరంరూరల్, జూలై 31: కేంద్రప్రభుత్వ ఎరువుల నియంత్రణ చట్టాన్ని సమర్థవంతంగా అమలుచేయడం ద్వారా నకిలీ ఎరువులు, పురుగుమందులను నియంత్రించవచ్చని భారత ప్రభుత్వ రాష్ట్రీయ ఎరువుల నియంత్రణ ప్రయోగశాల ఉపసంచాలకులు అరుణ్ అన్నారు. రాజమహేంద్రవరంలో మూడు రోజులపాటు 13 జిల్లాల మండల వ్యవసాయాధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులకు నిర్వహించే శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన అరుణ్ మాట్లాడుతూ మండలంలో ఎరువులు, పురుగుమందుల దుకాణాలను నిత్యం పర్యవేక్షించి రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు అందేలా వ్యవసాయ అధికారులు కృషి చేయాలన్నారు. వ్యవసాయ శాఖ అదనపు సంచాలకులు కృష్ణదాసు, జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు కైకలూరు వ్యవసాయ సహాయ సంచాలకులు గంగాధర్ మాట్లాడారు.



ఏజెన్సీ వరద ప్రాంతాల పర్యటనలో కలెక్టర్ దినేష్, ఎమ్మెల్యే శిరీష

# అన్నీ తానై..

- వరద సహాయ చర్యల్లో 10 రోజులపైగా చింతూరులోనే కలెక్టర్
- మండలానికో ఐఏఎస్ ద్వారా సేవలు నిరంతరం సేవలు
- వరద సాయంగా రూ.15.29 కోట్లతో ప్రతిపాదనలు
- ఒక్కరోజులోనే రూ.10 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

రంపచోడవరం/చింతూరు, జూలై31: ఒకటి రెండూ కాదు.. ఏకంగా పది రోజులకు పైగానే సాక్షాత్తూ అల్లూరి జిల్లా కలెక్టర్ మూరుమూల ఏజెన్సీ మండలా ల్లో ఉండిపోయారు. గోదావరి వరద సహాయక కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొని బాధితులకు బాసటగా నిలిచారు. ఆయనే అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్. గోదావరి పరీవాహక ప్రాంతంలోని నాలుగు విలీన మండలాల్లో వరద ముంచెత్తింది. రెండు వారాలపాటు వరద ముంపుతో ఏజెన్సీ ప్రజలు నానా కష్టాలుపడ్డారు. చింతూరులోనే కలెక్టర్ నివాసం ఉండి వరద సహాయక చర్యల్లో పదిరోజులకుపైగానే పాల్గొన్నారు. ఒకపక్క వరద సహాయ చర్యల్లో పాల్గొంటూనే పాడేరు కేంద్రంగా నిర్వర్తించాల్సిన కలెక్టరు విధులను చింతూరు నుంచే నిర్వర్తిస్తూ ప్రభుత్వాన్ని సంధానపర్చుతూ నిర్వాసితులకు భరోసా కల్పించారు. వరరామచంద్రపురం, కూనవరం, చింతూరు, ఎటపాక మండలాల్లోని 191 ఆవాసాల్లోని 35 వేలమంది వరదల ప్రభావానికి గురయ్యారు. ప్రతి మండలానికి ఒక ఐఏఎస్ అధికారిని, ఒక స్పెషల్ డిప్యూటీ కలెక్టరు చొప్పున నాలుగు మండలాలకు నియమించారు. ప్రతి మండలంలో సాధ్యమైనంతవరకూ ప్రతి వరద ప్రభావిత గ్రామాన్నీ సందర్శించి, అక్కడి నిర్వాసితుల గోడు విన్నారు. ప్రతిరోజూ ప్రభుత్వానికి ఇక్కడి పరిస్థితులను నివేదించడం ద్వారా యంత్రాంగాన్ని అప్రమత్తంచేశారు. సోమవారం ఆయన రూ.15.29 కోట్ల మేర నిధులు అవసరమని సమగ్ర నివేదిక పంపించడంతో ప్రభుత్వం మంగళవారం సాయంత్రం ఉత్తర్వులను జారీచేస్తూ తక్షణ సహాయంగా రూ.10 కోట్లను విడుదల చేసింది. నాలుగు మండలాల్లో వరద సహాయంపై నిర్వాసితుల్లో అసంతృప్తికి తావులేకుండా జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఎక్కడికక్కడ ఆయా సమస్యల పరిష్కారం కోసం భరోసా కల్పించారు.



మిర్తిపాడు వేగుళ్ళమ్మ అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు

## అమ్మవారికి సారె సమర్పణ

సీతానగరం, జూలై 31: సీతానగరం మండలం, మిర్తిపాడు గ్రామంలోని గ్రామదేవత శ్రీ వేగుళ్ళమ్మ అమ్మవారికి మహిళలు సారె సమర్పించారు. ఆషాఢమాసం సందర్భంగా బుధవారం వేగుళ్ళమ్మ అమ్మవారికి సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సహకారంతో మహిళలు అమ్మవారికి పూజలు నిర్వహించి 101 రకాల పిండి వంటలతో సారె సమర్పించారు.

## లోకేశ్ ఓఎస్డీగా ఆకుల

### గతంలో చింతూరు ఐటీడీఏ పీవో



చింతూరు, జూలై 31: వైఎస్ఆర్ జిల్లా బద్వేలు ఆర్డీవో ఆకుల వెంకటరమణను రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ కమ్యూనికేషన్ల శాఖల మంత్రి నారా లోకేశ్‌కు ఓఎస్డీగా నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరి ఎస్.సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆకుల వెంకటరమణ 2019 అక్టోబరు 10 నుంచి నుంచి 2022 జనవరి 29 వరకు చింతూరు ఐటీడీఏ పీవో కం ఆర్డీవోగా బాధ్యతలు నిర్వర్తించారు. తర్వాత బద్వేలు ఆర్డీవోగా అప్పటి ప్రభుత్వం బదిలీ చేసింది. ప్రకాశం జిల్లా మార్కాపురంనకు చెందిన ఆకుల తన తల్లిదండ్రులైన శ్రీరాములు, లక్ష్మీనరసమ్మల పేరిట మెమోరియల్ ట్రస్టు ప్రారంభించి యువతకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందజేస్తూ వస్తున్నారు.

## బాల దివ్యాంగులకు చేయూతనివ్వాలి : పీడీజే

రాజమహేంద్రవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాల వల్ల హక్కులను పొందకుండా ఉన్న బాల దివ్యాంగులకు సంబంధిత శాఖలు చేయూత ఇవ్వాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. బాల దివ్యాంగుల హక్కుల పరిరక్షణపై వివిధ శాఖల ప్రభుత్వాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో బుధవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బాల దివ్యాంగులు విద్య, వైద్యం వంటి వాటికి దూరం కాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు, 3వ, 7వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్‌లు రమ్య, పి.బాబు, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కర్రి రామారెడ్డి పాల్గొన్నారు.

## ప్రాజెక్టు ఫెలోల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 31 : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో రూసా నిధులతో నిర్వహించబడుతున్న పరిశోధనా ప్రాజెక్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భౌతికశాస్త్రం, భూ విజ్ఞానశాస్త్రం విభాగాల్లో ఒక్కొక్కటి చొప్పున ప్రాజెక్టు ఫెలోల నియామకానికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆసక్తి, అర్హత కల్గిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆగస్టు 5వ తేదీలోగా ఆన్‌లైన్‌లో సమర్పించాలని కోరారు. అదేవిధంగా దరఖాస్తు నమూనా, మరిన్ని వివరాలకు కళాశాల వెబ్‌సైట్‌లో సందర్శించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని ● ప్రత్తిపాడు ● జగ్గంపేట

## పునుగు పిల్లులు సంచారం

పెద్దాపురం, జూలై 31: అటవీ ప్రాంతంలో సంచారం చేయాల్సిన పునుగు పిల్లులు పెద్దాపురంలో సంచరించడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది. పాత పెద్దాపురంలో చారిత్రక పరిశోధకుడు వంగలపూడి శివకృష్ణ ఇంటి దగ్గర రాత్రి సమయంలో 3 పునుగు పిల్లులు ఇంట్లో నుంచి బయటకు వెళుతున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. అటవీశాఖ అధికారులు పునుగు పిల్లులను సంరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

## 'దళితుల భూముల కబ్జాకు ప్రయత్నిస్తే చర్యలు'

పిఠాపురం రూరల్, జూలై 31: దళితుల భూములను కబ్జా చేయాలని ప్రయత్నిస్తే సహించేది లేదని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ హెచ్చరించారు. పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2015లో శంఖవరం మండలం కత్తిపూడికి చెందిన మోర్త గవరయ్యకు చెందిన రూ.12కోట్లు విలువ చేసే 5.82 ఎకరాల భూమిని మోరంపూడికి చెందిన ఎం.వెంకటేశ్వరరావు, నారాయణమూర్తి, వాసుదేవరావు, జి.చిదానందరావులు అప్పు పేరుతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధితుడు గవరయ్య ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించారని తెలిపారు. దీనిపై గత నెల 27న కత్తిపూడిలో విచారణ నిర్వహించగా, అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టు నిర్ధారణ అయిందని చెప్పారు. దీంతో ఆ నలుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదయిందని వారిని తక్షణం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచాలని పోలీసులకు సూచించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి సత్తిబాబు, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఎద్దు సుబ్రహ్మణ్యం, మోర్త పెదపండు, ప్రేమ్ ప్రదీప్ పాల్గొన్నారు.

## 'పీఎంఈజీపీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

సర్పవరం జంక్షన్, జూలై 31: ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం సింగిల్ విండో పథకం ద్వారా అన్ని రకాల అనుమతులు 21 రోజుల్లో మంజూరు చేస్తుందని, ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా పథకం (పీఎంఈజీపీ) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం ఏడీ కె.కృష్ణార్జునరావు కోరారు. బుధవారం రమణయ్యపేట జిల్లా పరిశ్రమల కేంద్రంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం ఇండస్ట్రియల్ డవెలప్‌మెంట్ పాలసీ 2023-27 ద్వారా అందించే రాయితీలు, పీఎంఈజీపీలో లభించే రాయితీలు, క్లస్టర్ డవెలప్‌మెంట్ ద్వారా 10 మంది పారిశ్రామికవేత్తలకు రూ.5 నుంచి రూ.30 కోట్ల వరకు కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు ప్రోత్సాహక నిధులు మంజూరు చేస్తామన్నారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ ద్వారా 18 రకాల చేతివృత్తులవారికి రూ.15 వేల టూల్ కిట్‌తో పాటూ రూ.3లక్షల వరకు రుణ సౌకర్యం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

## జీజీహెచ్‌లో అరుదైన వైద్యం

జీజీహెచ్ (కాకినాడ), జూలై 31: తీవ్ర జ్వరంతో ఫిట్స్ రావడంతో తీవ్ర అనారోగానికి గురై వెంటిలేటర్‌పై చికిత్స పొందుతోన్న ఓ మహిళకు కాకినాడ జీజీహెచ్ వైద్యులు సూపర్ రిఫ్రాక్టరీ ఏపీలెప్సీ వంటి అరుదైన వైద్య చికిత్సలు అందించి పునర్జన్మను ప్రసాదించారు. అంతర్వేది బుట్టాయిగూడెనికి చెందిన మహిళా రోగిని కుటుంబ సభ్యులు జీజీహెచ్‌కు తీసుకువచ్చారు. న్యూరాలజీ విభాగంలో రోగి చేరగా హెచ్‌వోడీ డాక్టర్ ఎస్ఎం షరీఫ్, డాక్టర్ రవితేజల వైద్యబృందం ఆధ్వర్యంలో వైద్యసేవలు అందించారు. ఈ జబ్బును పోస్ట్ వైరల్ సూపర్ రిఫ్రాక్టరీ స్టేటస్ ఎపిలిప్టికస్‌గా గుర్తించి ఖరీదైన ఐవీ ఐజీ వైద్యం ద్వారా ఆరోగ్యలో వైద్యం అందించారు. రోగి వారంరోజుల్లో పూర్తి ఆరోగ్యంగా కోలుకుంది. వైద్యం చేసిన జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, హెచ్‌వోడీ, వైద్య బృందానికి తల్లిదండ్రులు బొకే ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు.

## టీడీపీ నేత చంద్రమౌళి మృతి

తాళ్లరేవు, జూలై 31: కోరింగ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు, తాళ్లరేవు మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంటపల్లి చంద్రమౌళి బుధవారం అకాలంగా మృతిచెందారు. చంద్రమౌళి భౌతికాయానికి ఎమ్మెల్యే బుచ్చిబాబు నివాళిలర్పించారు. తాళ్లరేవు చెరువుగట్టు సెంటరు నుంచి పాతకోరింగ వరకు చంద్రమౌళి అంతిమయాత్ర జరిగింది. ఎంపీపీ రాయుడు సునీత, మాజీ ఎంపీపీ టేకుమూడి అనంతలక్ష్మి, టీడీపీ నేతలు కట్టా త్రిమూర్తులు, పొన్నమండ రామలక్ష్మి, పెమ్మాడి కృష్ణవేణి, వాడ్రేవు వీరబాబు, మందాల గంగసూర్యనారాయణ, టేకుమూడి లక్ష్మణరావు, నడింపల్లి వినోద్, దళిత నేతలు జక్కుల ప్రసాద్‌బాబు, కాశి లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

## పలువురు ఇన్‌ఛార్జి డైరెక్టర్లుగా బాధ్యతల స్వీకరణ

జేఎన్టీయూకే, జూలై 31: కాకినాడ జేఎన్టీయూకేలో జరిగిన అంతర్గత బదిలీల్లో ఇన్‌ఛార్జి డైరెక్టర్లుగా నియామకమైన పలువురు ప్రొఫెసర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బి.బాలకృష్ణ ఇన్‌ఛార్జి డీఏపీగా, ప్రొఫెసర్ జి.పద్మజారాణి ఇన్‌ఛార్జి డీఈగా, స్వర్ణకుమారి ఎఫ్‌యూఏఆర్ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా, ఐక్యూఏసీ ఇన్‌ఛార్జి డైరెక్టరుగాను ప్రొఫెసర్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్, ఫార్మసీ కోర్సుల ప్రత్యేకాధికారిణిగా కె.పద్మప్రియ బాధ్యతలు చేపట్టారు. నూతన ఇన్‌ఛార్జి డైరెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్లను ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, రెక్టార్ కేవీ రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు, ఐఎస్టీ డైరెక్టర్ ఏ.గోపాలకృష్ణ అభినందించారు.

## కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 31: కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమెను నగరపాలక సంస్థ కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి అంశాలు, సమస్యలపై కమిషనర్‌తో చర్చించారు. ఆయా నియోజకవర్గాల నాయకులు ఉన్నారు.

## 'ఆదిత్య'కు ఇండియా బుక్ ఆఫ్ రికార్డు

గండేపల్లి, జూలై 31: మండలంలోని సూరంపాలెం ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల ఫోరెన్సిక్ సైన్స్ విభాగంలో విద్యార్థులు గంటలో 1037 ఫోరెన్సిక్ శాస్త్రీయ పద్ధతులను అనుసరించి వేలిముద్రలు సేకరించడం ద్వారా ఇండియా బుక్ ఆఫ్ రికార్డుల్లో సరికొత్త రికార్డు సృష్టించారు. ఆదిత్యలో జరిగిన కార్యక్రమానికి సెంట్రల్ టొబాకో రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ నుంచి డాక్టర్ కె.సరళ, సీఐడి ఫింగర్ ఫింగర్ ప్రింట్ బ్యూరో కాకినాడ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ప్రశాంతి పాల్గొని వేలిముద్రలను తీసుకున్నారు. విద్యార్థులు, అధ్యాపకుల్ని ఆదిత్య చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి,వైస్‌చైర్మన్ సతీష్‌రెడ్డి అభినందించారు.

## టీడీపీలోకి వార్డు మెంబర్లు చేరిక

ప్రత్తిపాడు, జూలై 31: మండలంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీకి చెందిన బురదకోటకు చెందిన వైసీపీ వార్డు మెంబర్లు వైసీపీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే సత్యప్రభ సమక్షంలో టీడీపీలోకి చేరారు. బురదకోట1వ వార్డు మెంబర్ మాడెం ప్రసాద్, కొండపల్లి 3వ వార్డుమెంబర్ కాపురి సత్యవతి, ఉలిగోగుల 6వ వార్డుమెంబర్‌కాపురి నాగమణి, మెట్టిచింత 7వ వార్డు మెంబర్ లోటా రాఘవులు ప్రత్తిపాడు టీడీపీ కార్యాలయంలో టీడీపీలో చేశారు. బురదకోట మాజీ సర్పంచ్ నిమ్మల అప్పారావు, టీడీపీ కాకినాడ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, యాళ్ల జగదీష్,చీకట్ల నాని ఉన్నారు.

## డీఐవో రత్నాకరరావుకు సత్కారం

జీజీహెచ్ (కాకినాడ), జూలై 31: కాకినాడ జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డీఐవో)గా పని చేస్తూ పదవీ విరమణ చేసిన డాక్టర్ కె.రత్నాకరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ మాట్లాడుతూ రత్నాకరరావు జిల్లాలో సమర్థవంతంగా చిన్నారులకు ఇమ్యూనైజేషన్ కార్యక్రమాలు పటిష్టంగా అమలయ్యేలా కృషి చేశారన్నారు.

## మంత్రి నాదెండ్లకు అభినందన

సామర్లకోట, జూలై 31: పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్‌కు కాకినాడ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నున్న రామకృష్ణ బుధవారం అమ రావతిలో మంత్రి చాంబర్లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. అంతకు ముందు రాష్ట్ర రైస్‌మిల్లర్లతో మంత్రి నిర్వహించిన పౌరసరఫరాల సమీక్షలో నున్న పాల్గొన్నారు.

## 'పింఛన్ల పంపిణీలో కూటమి శ్రేణులు పాల్గొనాలి'

కాకినాడ సిటీ, జూలై 31: కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలో గురువారం నిర్వహించే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కూటమి శ్రేణులందరూ పాల్గొనాలని సిటీ ఎమ్మెల్యే కార్యాలయం నుంచి జారీ చేసిన ప్రకటనలో కోరారు. ప్రతి డివిజన్‌లో సచివాలయం సిబ్బందితోపాటు టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. 10వ డివిజన్ దుమ్ములపేటలో జరిగే పింఛన్ల పంపిణీలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పాల్గొననున్నారు.

## 'పింఛన్ల పంపిణీలో అలసత్వం వహించొద్దు'

కిర్లంపూడి, జూలై 31: పింఛన్ల పంపిణీలో అలసత్వం వహించరాదని ఎంపీడీవో బడే రాజేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ విద్యా సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గురువారం పింఛన్ల పంపిణీ ఉదయం 6 గంటల నుంచి ప్రారంభించి సాయంత్రం 6గంటలలోపు ముగించాలని ఆదేశించారు. సమావేశంలో పంచాయతీ విస్తరణాధికారి ఎస్.సత్యప్రసాద్, ఎంఈవో టి.జోసెఫ్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు కిట్లు అందజేత

శంఖవరం, జూలై 31: కత్తిపూడిలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యాకిట్లను రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు వెన్నా ఈశ్వరుడు (శివ) అందజేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు వెంకట సుభాష్, జనసేన నాయకులు కరణం సుబ్రహ్మణ్యం, కొయ్యా రమణ, పిర్ల అప్పారావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

## నేడు నాగబాబు, ఎమ్మెల్సీ హరిప్రసాద్ పర్యటన

గొల్లప్రోలు రూరల్, జూలై 31: జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ గురువారం పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. వారు పిఠాపురం మండలం చిత్రాడ, కొత్తపల్లి మండలం కొండెవరం గ్రామాల్లో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొంటారని పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు.

# ఆయిల్‌పామ్ రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం

**పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప**

పెద్దాపురం, జూలై 31: ఆయిల్‌పామ్ రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలోని ఆర్‌బీపట్నం గ్రామంలో బుధవారం కల్లూరి శ్రీనివాస్ వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన ఆయిల్ పామ్ తోటల విస్తరణ మహోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ రైతులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని, భవిష్యత్తులో మరిన్ని ప్రోత్సాహకాలను అందించనున్నట్టు పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచాలని రైతులను కోరారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి మల్లిఖార్జునరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా ఐదు ఎకరాల లోపు రైతులకు ఒక ఎకరం సాగుకు మొత్తం రూ.75,449 లబ్ధి పొందవచ్చని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. కార్యక్రమంలో హెచ్ఆర్ఎస్ శాస్త్రవేత్త జానకి,డీఎంఐవో వరప్రసాద్, ఉద్యానశాఖాధికారిణి నూనే సుజాత, ఏవో సంజయ్ కుమార్, పుట్టా సోమన్న చౌదరి, పాలకుర్తి శ్రీనుబాబు, కందుల విశ్వేశ్వరరావు, వీఏఏ పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ మహోత్సవంలో చినరాజప్ప

### పింఛన్ల పంపిణీలో పాల్గొనాలి

సామర్లకోట, జూలై 31: గురువారం ఉదయం 6 గంటలకే లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం విలేకరులతో ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ పారదర్శకంగా ఉండేందుకు, త్వరితగతిన లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ పూర్తయ్యేందుకు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సహకరించాలని కోరారు. పంపిణీ మొదటి రోజు సాయంత్రం నాటికే 99 శాతం పంపిణీ చేసేందుకు సమిష్టి సమకారం ఎంతో అవసరన్నారు.



సమావేశంలో నేలపై భైఠాయించి నిరసన తెలుపుతున్న టీడీపీ కౌన్సిలరు గుళ్ల సుబ్బారావు

## వాడివేడిగా గొల్లప్రోలు నగర పంచాయతీ సమావేశం

గొల్లప్రోలు, జూలై 31: గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశం వాడివేడిగా జరిగింది. సమావేశం ప్రారంభం కాగానే అజెండాలో వచ్చిన ఎన్నికల అడ్వాన్స్ లక్ష రూపాయిలు వ్యయంపై టీడీపీ కౌన్సిలరు గుళ్ల సుబ్బారావు ప్రశ్నించారు. గత సమావేశంలో రూ.33వేలు వ్యయం అని చెప్పి ఇప్పుడు రూ.లక్షకు బిల్లు పెట్టడం ఏంటని నిలదీశారు. ఓటింగ్ పెట్టాలంటూ చైర్‌పర్సన్ భర్త, వైసీపీ కౌన్సిలర్ గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి అనగా ఎవరు మాట్లాడకపోవడంతో నీవు ఒకరివే వ్యతిరేకిస్తున్నావంటూ సుబ్బారావును ఉద్దేశించి వాఖ్యానించారు. ఓటింగ్ విషయం కౌన్సిలర్‌కు సంబంధం ఏంటని, చైర్‌పర్సన్ లేదా కమిషనరు ఓటింగ్ కోరాలని చెప్పారు. పూర్తి వివరాలు చెప్పేవరకూ సమావేశం జరగరాదంటూ కౌన్సిల్‌హాలులో నేలపై భైఠాయించి నిరసనకు దిగారు. దీంతో సమావేశం సుమారు 20 నిమిషాలు పాటు నిలిచిపోయింది. కమిషనరు రవికుమార్ మాట్లాడుతూ రూ.లక్ష పూర్తిగా వ్యయం కాలేదని, ఖర్చుల వివరాలు తెలియజేస్తామన్నారు. అయినా సుబ్బారావు శాంతించలేదు. వైస్‌చైర్మన్ తెడ్లపు అలేఖ్యరాణి మాట్లాడుతూ ప్రతి ఖర్చుకు బిల్లులు ఉంటాయి కదా అని వాఖ్యానించారు. ఎన్నికల అడ్వాన్స్ తీసుకున్న ఉద్యోగి సీతారాం వివరాలు చెబుతుండగా, కొందరు కౌన్సిలర్లు ప్రశ్నలు లేవనెత్తారు. టీపీవోను చెప్పమని కమిషనరు కోరగా, అడ్వాన్స్ తీసుకున్నవారే వివరించాలన్నారు.

### ఏఈకి తీవ్ర అస్వస్థత

గొల్లప్రోలు నగర పంచాయతీ ఏఈ ప్రభాకర్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బుధవారం జరిగిన నగరపంచాయతీ సమావేశానికి హాజరైన ఆయన సభ్యుల ప్రశ్నలకు జవాబులు చెప్పారు. అనంతరం తాను టైఫాయిడ్‌తో బాధపడుతున్నానని, నీరసంగా ఉందని నిలబడే ఓపిక లేదని చెప్పి సమావేశం నుంచి బయటకు వచ్చి వాటర్ ప్లాంట్‌కు వెళ్లారు. అక్కడ ఏఈకి రక్తపు వాంతులు కావడంతో సహచర సిబ్బంది కాకినాడఆసుపత్రికి తరలించారు.

## అధికారులపై కౌన్సిలర్ల ఆగ్రహం

పెద్దాపురం, జూలై 31: ప్రజా సమస్యల పరిష్కారంపై మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం బుధవారం జరిగింది. కౌన్సిలర్ అరెళ్ల వీర్రాఘవరావు మాట్లాడుతూ పట్టణంతో పాటు తమ వార్డులో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంటోందని, కేవలం ప్రధాన వీధుల్లోనే కాకుండా శివారు ప్రాంతాల్లో కూడా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ పట్టణ ప్రణాళికా విభాగం టీపీవో లేకపోవడంతో అస్తవ్యస్తంగా మారిందని, పట్టణంలో ఆక్రమణలు పెరిగిపోతున్నాయన్నారు. కౌన్సిలర్ విడ దాసరి రాజా మాట్లాడుతూ తమ వార్డులు విద్యుత్ లైట్ల సమస్యపై ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడం ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కమిషనర్ కేవీ పద్మావతి, డీఈ ఆదినారాయణ, ఏఈ జీవప్రసాద్, మేనేజర్ జ్యోతీరాణి, శానిటరీ ఇనస్పెక్టర్ దావీదురాజు పాల్గొన్నారు.

## సామర్లకోట కౌన్సిల్ సమావేశం

సామర్లకోట, జూలై 31: బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ జీ.అరుణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో వైసీపీ సభ్యుడు చల్లపల్లి శ్రీను మాట్లాడుతూ పట్టణంలో చెత్త తరలించే ట్రాక్టర్లకు రోజూ బంకులలో కొట్టించే డీశెల్‌ఆయిల్‌లో సిబ్బంది పెద్దఎత్తున అవకతవకలకు పాల్పడుతున్నారని ఇందులో అధికారులకు సైతం భాగస్వామ్యం ఉందని ఆరోపించారు. మున్సిపాల్టీకి వివిధ పన్నుల రూపేణా నెలవారీ ఎంత మొత్తం వసూలు అవుతుంది, ఎంత మేర ఖర్చులు పెడుతున్నారు సమగ్ర వివరాలు సభ్యులకు నివేదికల రూపంలో అందివ్వాలని నేతల హరిబాబు డిమాండ్ చేశారు. పట్టణంలో టౌన్‌ప్లానింగ్ అధికారుల పనితీరు అయోమయంగా ఉందని పలువురు సభ్యులు ఆరోపించారు. కమిషనర్ జాస్తి రామారావు, అధికారులున్నారు.

## అన్నవరం దేవస్థానానికి చేరిన నూతన బస్సుల చాసెస్‌లు

అన్నవరం, జూలై 31: సత్యదేవుడి సన్నిధికి రోడ్డు, రైలు రవాణాలో విచ్చేసే భక్తులకు కొండదిగువ నుంచి కొండపైకి, రైల్వేస్టేషన్‌కు చేరవేసేందుకు దేవస్థానం 2 నూతన బస్సులు కొనుగోలు చేయగా వీటికి సంబంధించి అశోక్ లైలాండ్ కంపెనీ నుంచి చాసెస్‌లు బుధవారం అన్నవరానికి చేరుకోగా వాటిని ఈవో రామచంద్రమోహన్ ప్రారంభించి బాడీబిల్డింగ్ నిమిత్తం వర్క్‌షాప్‌కు తరలించారు. 2 బస్సులకు సుమారు రూ.40లక్షలు అవుతుందని ఈవో తెలిపారు. ప్రస్తుతం 2 ఉచితబస్సులతో పాటు భక్తులను కొండదిగువ నుంచి, రైల్వేస్టేషన్ నుంచి తీసుకెళ్లేందుకు మరో 5 బస్సులు వినియోగిస్తున్నారు. వాటిని కొనుగోలు చేసి 15 ఏళ్లు దాటుతుండడంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో కొత్త బస్సులు కొనుగోలు చేయాలని నిర్ణయించారు. నూతన బస్సులు 2 వినియోగంలోకి వస్తే 2పాతబస్సులను వేలం ద్వారా విక్రయించాలని నిర్ణయించారు. సెప్టెంబరు నెలాఖరుకల్లా నూతన బస్సులు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు.

# రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధే ధ్యేయం

**ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ**

ప్రత్తిపాడు, జూలై 31: రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. సర్వేపల్లి రాధాకృష్ణ, విద్యార్థి మిత్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక రెడ్నం రామూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండలంలోని 5819 మంది విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు తదితర సామాగ్రితో కూడిన కిట్లను పంపిణీ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 16వేల పై బడి ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభు త్వం చర్యలు చేపడుతుందన్నారు. పాఠశాలలోమధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవోలు డి.రాజబాబు, అచ్చిరాజు, హైస్కూల్ హెచ్ఎం సత్యనారాయణ రెడ్డి, టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ల జగదీష్, బీజేపీ నాయకుడు సింగిలిదేవ్ సత్తిరాజు, టీడీపీ నాయకులు సత్యంశెట్టి సీతారామం, రొంగల సత్యనారాయణ, మంతెనశ్రీను, ఇళ్ల అప్పారావు, మదినే దొరబాబు, మాజీ సర్పంచ్‌లు మూరా వరప్రసాద్, పంచాది వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో మాట్లాడుతున్న సత్యప్రభ

**ఏలేశ్వరం:** సర్వేపల్లి రాధాకృష్ణ, విద్యార్థి మిత్ర కార్యక్రమంలో భాగంగా ఎంఈవో బి. అబ్బాయి ఆధ్వర్యంలో ఏలేశ్వరం, లింగంపర్తి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ప్రత్తిపాడు జనసేన ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు అందజేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, టీడీపీ మండలాధ్యక్షులు సూతి బూరయ్య, జ్యోతుల పెదబాబు, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, యండగుండి నాగబాబు, సర్పంచ్ యార్లగడ్డ హైమావతి, చిక్కాల రాజ్యలక్ష్మీదేవి, పసల సూరిబాబు, చిక్కాల లక్ష్మణరావు, పెంటకోట శ్రీధర్ ఉన్నారు.

# ఎన్టీఆర్ బీచ్ పూర్వ వైభవానికి కృషి చేస్తా

**కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ**



యుద్ధ మ్యూజియం సందర్శిస్తున్న ఎమ్మెల్యే

సర్పవరం జంక్షన్, జూలై 31: ఎన్టీఆర్ బీచ్‌కు పూర్వవైభవం తీసుకువచ్చేలా కృషి చేస్తానని, అసంపూర్తిగా నిలిచిన యుద్ధ విమాన మ్యూజియం నిర్మాణ పనులు పూర్తి చేసి సత్వరంగా వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశించారు. బుధవారం సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో యుద్ధ విమాన మ్యూజియం, ఎన్టీఆర్ బీచ్‌ను ఆయన సందర్శించి మాట్లాడుతూ బీచ్‌ను ఉమ్మడి జిల్లాలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానన్నారు. యుద్ధ విమాన మ్యూజియంలో అసంపూర్తిగా నిలిచిన బ్యూటిఫికేషన్, ఎలక్ట్రిఫికేషన్ పనులను సత్వరంగా పూర్తి చేసి సందర్శలను అనుమతించేలా చర్యలు తీసుకోవాలని కుడా అధికారులను ఆయన ఆదేశించారు.

### కమిటీ సభ్యులు కృషి చేయాలి

కాకినాడ రూరల్, జూలై 31: జనసేన పార్టీని మరింత పటిష్ఠంచేసేందుకు కాకినాన రూరల్ మండల కమిటీ సభ్యులు కృషి చేయాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. ఇంద్రపాలెంలోని పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి కల్యాణ మండపంలో బుధవారం రూరల్ జనసేన మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పంతం నానాజీ, అరుణ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శిరంగు శ్రీనివాసరావు, రెడ్డిపల్లి కిషోర్, తడాల అబ్బు, పొండ్రంకి రాజు, పెంటపాటి సతీష్ ఉన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలి

తాళ్లరేవు, జూలై 31: పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. బుధవారం జార్జీపేట పంచాయతీ ఎమ్ఎల్‌కె నగర్‌లో దివంగత ఎంపీటీసీ మండపల్లి నాగమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన మొక్కలను ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నాటే కార్యక్రమానికి దాట్ల శ్రీకారం చుట్టారు. ఎంపీపీ రాయుడు సునీత, టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, కట్టా త్రిమూర్తులు, వాడ్రేవు వీరబాబు, పెదపాటి కామేశ్వరరావు, కడలి శ్రీనివాస్, కూనపురెడ్డి కామేశ్వరరావు, పిల్లి సత్తిబాబు, మండపల్లి రాంబాబు పాల్గొన్నారు. మండలంలో ఇటీవల మృతిచెందిన బాధిత కుటుంబాల సభ్యులను ఎమ్మెల్యే దాట్ల పరామర్శించారు. టీడీపీ నేతలు నడింపల్లి వినోద్, సుబ్బరాజు, వేగేశ్న భాస్కరరాజు, చెల్లి అశోక్‌కుమార్, మోపూరి వెంకటేశ్వరరావు, గుత్తుల సూర్యనారాయణ, కాలా సత్తిబాబు ఉన్నారు.



జార్జిపేటలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే

# ఏలేరు ఆధునీకరణ పూర్తి చేసి కష్టాలు తీరుస్తాం

**పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ**

పిఠాపురం రూరల్, జూలై 31: ఏలేరు ఆధునీకరణను పూర్తి చేసి రైతుల కష్టాలను తీరుస్తామని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురం మండలం మంగితుర్తిలో ఏలేరు కాలువలను ఆయన బుధవారం రైతులతో కలిసి పరిశీలించారు. గట్లు బలహీనంగా ఉండటం వలన వెంకన్న చేను కాలువ, యాళ్ల వారి కాలువ పరిధిలో పొలాలుకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు. దీనిపై వర్మ స్పందిస్తూ గట్లును పటిష్ట పరిచేందుకు వేయి ఇసుకబస్తాలతో రింగ్‌బండ్‌ను ఇరిగేషన్ అధికారులు ఏర్పాటు చేస్తారని, వేసవిలో కాంక్రీటు రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపడతామని వర్మ హామీ ఇచ్చారు. ఆయన వెంట టీడీపీ పిఠాపురం మండలాధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్, బర్ల అప్పారావు, సత్యనారాయణ చౌదరి, కసిరెడ్డి సుబ్రహ్మణ్యం, వెంకట్రావు, వెంకటరమణ, నాగబాబు, నడిగట్ల సత్యనారాయణ, బాబులు, రామిరెడ్డి అప్పన్న, శివ, విశ్వనాదుల వీరభద్రరావు, కోలా చిన్న, రాజు పాల్గొన్నారు.

### పూర్తిస్థాయిలో అండగా ఉంటాం

పిఠాపురం, జూలై 31: పిఠాపురం మహారాజా మేనకోడలికి, ఆమె కుటుంబానికి పూర్తిస్థాయిలో అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే వర్మ తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్సు ఎదురుగా ఉంటున్న వీధిలో మహారాజా మేనకోడలు విన్నపాల చంద్రలేఖ కుటుంబ సభ్యులను వర్మ కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఏ కష్టమొచ్చినా తమకు తెలియజేయాలని సూచించారు.

## వాసవీమాతకు సారె



అన్నవరంలో సారెను సమర్పించిన మహిళలు

అన్నవరం, జూలై 31: గ్రామంలో కొలువుదీరిన వాసవీమాతకు బుధవారం వనితాక్లబ్, ఆర్యవైశ్య సంఘ మహిళలు ఆషాడం సారెను సమర్పించారు. మహిళలంతా తమకు తోచిన పదార్థాలను గుడివద్దకు తీసుకొచ్చి గ్రామంలో ఊరేగించి అమ్మవారి ఆలయంలో సమర్పించి నివేదించారు. మహిళలు ధరించిన ఏకరూప దుస్తులు, ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో వనితాక్లబ్ నాయకులు చక్రావతి, గౌతమి, కుమారి, దాసరి సత్య పాల్గొన్నారు.

### పిఠాపురంలో...

పిఠాపురం, జూలై 31: పిఠాపురంలోని వాసవీ అమ్మవారికి మహిళలు సారె సమర్పించారు. పట్టణంలోని కోటగుమ్మం సెంటర్‌లో ఉన్న వాసవి కన్యకాపరమేశ్వర అమ్మవారి ఆలయం వద్దకు శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం నుంచి వాసవి భక్త సమాజానికి చెందిన మహిళలు సారె తీసుకుని వచ్చారు. అమ్మవారికి సారె సమర్పించి పూజలు నిర్వహించారు. వాసవి కన్యకా పరమేశ్వరీ, గీతా మహిళా భక్త సమాజం సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు, భక్తులున్నారు.



పిఠాపురంలో సారె సమర్పిస్తున్న మహిళలు

## ఎస్‌ఐలకు ఎస్పీ ప్రశంసాపత్రాలు



ఎస్పీ నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న ఎస్‌ఐలు

ప్రత్తిపాడు, జూలై 31: ప్రత్తిపాడు పోలీస్ సర్కిల్ పరిధిలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి ఎస్‌ఐలు ఎం.పవన్‌కుమార్, జి.సతీష్‌కుమార్, వెంకటేష్‌లకు బుధవారం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రశంసాపత్రాలు, రివార్డులు అందజేశారు. ప్రత్తిపాడు ఫైర్‌స్టేషన్ సమీపంలో వైద్య ఉద్యోగి మచ్చికర్ల అప్పలస్వామి ఇంట్లో జరిగిన దొంగతనం కేసును 48 గంటల్లో చేదించి పదహారున్నర లక్షల బంగారం, రెండున్నర లక్షల నగదును స్వాధీనం చేసుకోవడంతో ఎస్‌ఐలకు ఎస్పీ ప్రసంశాపత్రాలు, రివార్డులు అందించి అభినందించారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి కూడా పాల్గొన్నారు.

## విద్యతో పాటు క్రీడలపై దృష్టి పెట్టాలి



యోగా పోటీల్లో విజేతలను అభినందిస్తున్న డీఈవో

పిఠాపురం, జూలై 31: విద్యతో పాటు యోగా, క్రీడలపై దృష్టి పెట్టాలని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ సూచించారు. చెన్నైలో జరిగిన ఇంటర్నేషనల్ ఇన్విటేషన్ స్పోర్ట్స్ యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని మొదటి మూడు స్థానాల్లో నిలిచిన పిఠాపురం బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులు సమంత పవిత్ర, విజయప్రభలను, వీరికి శిక్షణ ఇచ్చిన యోగా ట్రైనర్ వనం సత్యప్రియలను డీఈవో బుధవారం అభినందించారు. విద్యార్థులతో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ శ్యాంబాబు తదితరులు ఉన్నారు.

## ఏపీజీఈఏ కార్యవర్గ సమావేశం

కాకినాడ సిటీ, జూలై 31: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏపీజీఈఏ) జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు మల్లాది జగన్నాథం అధ్యక్షతన ట్రెజరీ కార్యాలయ ప్రాంగణంలోని సంఘ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ నాయకత్వానికి సంపూర్ణ మద్దతు తెలుపుతూ తీర్మానం చేశారు. రాష్ట్రస్థాయిలో బహిష్కరించిన ఇద్దరు నాయకులు పెడుతున్న వీడియోలు, ఇతర మెసేజ్‌లు నమ్మవద్దని, ఉద్యోగులందరూ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణను నమ్మి వారి నాయకత్వానికి మద్దతు తెలపాలని కోరారు. జిల్లా కార్యవర్గం, అన్ని తాలూకా కార్యవర్గాలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాపారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో తనిఖీలు

సామర్లకోట, జూలై 31: మండలంలోని పలు గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో స్టూడెంట్ కిట్ల్ పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం అమలుతీరులను పరిశీలించేందుకు ఎంఈవోలు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఎంఈవో వై.శివరామకృష్ణ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. గొంచాలలో మండల పరిషత్ ప్రాథమిక పా ఠశాలను ఎంఈవో-2 పి.పుల్లయ్య తనిఖీ చేశారు. పనస పాడు మండల పరిషత్ ప్రాథమిక విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను తెలుగుయువత ప్రధాన కార్యదర్శి, సర్పంచ్ చీకట్ల వెంకటేష్ పంపిణీ చేశారు.

## వరి, మొక్కజొన్న పంటల పరిశీలన

జగ్గంపేట రూరల్, జూలై 31: మండలంలోని కాట్రావులపల్లి, గుర్రపాలెం గ్రామాల్లో మొక్కజొన్న, వరి పంటలను బుధవారం వ్యవసాయాధికారి రెడ్ల శ్రీరామ్,ఏరువాక కేంద్రం వ్యవసాయ పరిశోధన స్థానం, పెద్దాపురం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ.సీతారామశర్మ, డాక్టర్ ఎం.రామచభద్రరాజు పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

## గురజనాపల్లిలో మొక్కల వితరణ

కరప, జూలై 31: గురజనాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు రూ.3వేలు విలువ చేసే పలు మొక్కలను వితరణ చేశారు. హెచ్ఎం సాయిమోహన్, ఇతర ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు వీవీ రమణమూర్తి, శోభాకర్, ఎ.సూర్యనారాయణ, నాగలింగేశ్వరరావు, భవానీ, ప్రభారాణి తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మలపల్లి రమేష్ పరామర్శ

జగ్గంపేట, జూలై 3: సీతారాంపురం గ్రామానికి చెందిన సేపరి ప్రసాద్ ఆపరేషన్ చేయించుకోవడంతో జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు. ఆయన వెంట మరిసే రామకృష్ణ, పులి ప్రసాద్, సూరపరెడ్డి నరేష్, మండపాక శ్రీరామ్, సీతారాంపురం ఉన్నారు.

## వైద్య పరికరాలకు ఆర్థిక సాయం

రౌతులపూడి, జూలై 31: రౌతులపూడి ప్రభుత్వాసుపత్రిలో దంత వైద్య పరికరాల కొనుగోలుకు స్థానిక వర్తక సంఘం రూ.50వేలు ఆర్థికసహాయం సూపరింటెండెంట్ జనాకి దేవి, దంత వైద్యుడు ఉమామహేశ్వరరెడ్డికి అందజేశారు. సంఘం సభ్యులు, ఉప సర్పంచ్ వాసిరెడ్డి భాస్కరరావు పాల్గొన్నారు.

## 'డాక్టర్ రాకపోతే ఎలా'

రౌతులపూడి, జూలై 31: మండలంలోని గిడజాం గ్రామంలో బుధవారం 104 వాహనంలో వైద్యసిబ్బంది తప్ప డాక్టర్ రాలేదు. దీంతో గ్రామస్తులు, టీడీపీ నేత తండపురెడ్డి అప్పారావు వైద్యసిబ్బందిని డాక్టర్ రాకపోతే ఎలాఅని ప్రశ్నించారు.